# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-09-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 138వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**

2. **తుపాను ప్రభావంతో ఉపాధి కోల్పోయిన మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

3. **శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు సిబ్బంది కీలకపాత్ర పోషిస్తున్నారని విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.**

4. **జపాన్ వేదికగా జరుగుతోన్న ఆసియా క్రీడ పోటీల్లో భారత దేశానికి మూడో స్వర్ణ పతకం లభించింది.**

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 138వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. ఈ కార్యక్రమం ఆకాశవాణి, దూరదర్శన్ నెట్ వర్క్ అంతటా, న్యూస్ ఆన్ ఎ.ఐ.ఆర్.జీ.వో.వి.ఇన్, న్యూస్ ఆన్ ఎయిర్ మొబైల్ యాప్ లో ప్రసారమవుతుంది. అలాగే, న్యూస్ ఆన్ ఎ.ఐ.ఆర్, డి డి న్యూస్, పి. యం.వో, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖల యు ట్యూబ్ ఛానెళ్లలో కూడా ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారమవుతుంది. హిందీ ప్రసారం ముగిసిన వెంటనే.. ఆకాశవాణి ఈ కార్యక్రమాన్ని ప్రాంతీయ భాషల్లో ప్రసారం చేస్తుంది.

---------------------------

రాష్ట్రంలో భారీ వర్షాలు, ఉత్తరాంధ్రలో వరద పరిస్థితులపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఈరోజు సమీక్షించారు. ముంపు ప్రాంతాల్లో పునరావాస చర్యలు, పంట నష్టం, నదులు, రిజర్వాయర్లలో నీటి ప్రవాహంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత ఐదు రోజులుగా సముద్రంలో వేటకు వెళ్లలేకపోయిన మత్స్యకార కుటుంబాలకు 50 కిలోల చొప్పున ఉచిత బియ్యం అందించాలని అధికారులను ఆదేశించారు. శ్రీకాకుళం జిల్లాలోని హీర మండలం లిఫ్ట్ ప్రాజెక్టుకు విద్యుత్ సౌకర్యం కల్పించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రకాశం బ్యారేజీ వద్ద స్థానిక వరదను నిల్వ చేసేందుకు పులిచింతల దిగువన, బ్యారేజీ ఎగువన కొత్త బ్యారేజీల నిర్మాణ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు.

తాజా వర్షాలతో రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 నుంచి 31 శాతానికి తగ్గిందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని వైఎస్సార్ కడప, కర్నూలు, ఏలూరు, అనంతపురం జిల్లాలలో పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న స్టైఫండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ల పాసింగ్ ఔట్ పరేడ్ ను ఈరోజు నిర్వహించారు. ఆయా జిల్లాలో జరిగిన కార్యక్రమాల్లో జిల్లా మంత్రులు పాల్గొని పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు సిబ్బంది కీలకపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. పోలీసు ఉద్యోగం 24 గంటల బాధ్యతతో కూడుకున్నదని, ప్రజలకు కష్టం, భయం వచ్చినప్పుడు పోలీసులనే ఆశ్రయిస్తారని చెప్పారు. ఆధునిక శిక్షణతో సైబర్, ఆర్థిక నేరాలను సమర్థంగా ఎదుర్కొనే స్మార్ట్ పోలీసులుగా ఎదగాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచిస్తూ..

వాయిస్..25.. సెకన్లు

---------------------------

తుపాను ప్రభావంతో వేటకు వెళ్లలేక ఉపాధి కోల్పోయిన మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని అర్హులైన ప్రతి మత్స్యకార కుటుంబానికి 50 కిలోల చొప్పున ఉచిత బియ్యం అందించనున్నట్లు చెప్పారు. బియ్యం పంపిణీకి జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. వాతావరణం అనుకూలించే వరకు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని సూచించారు.

కాగా, కాకినాడ నుంచి చేపల వేటకు వెళ్లిన మోటరైజ్డ్ పడవ ఈరోజు ఉదయం ఒడిశాలోని పారాదీప్‌కు సురక్షితంగా చేరుకుందని, పడవలో ఉన్న తొమ్మిది మంది మత్స్యకారులు క్షేమంగా ఉన్నట్లు మంత్రి తెలిపారు.

---------------------------

కళ, సాంస్కృతిక వైభవాన్ని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజామహేంద్రవరంలో ఆయన ఈరోజు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. సాంస్కృతిక రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ తెలియజేస్తూ..

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ప్రజలకు సేవ చేయడం ద్వారా దేశానికి సేవ చేయాలనే దృఢ సంకల్పంతో, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజా సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా ప్రాంతీయ వార్తా విభాగం 'సేవా సంకల్ప అభియాన్' ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా దేశంలో తయారీ ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో చేపట్టిన సులభతరం వాణిజ్యం-ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కార్యక్రమం గురించి ఈరోజు తెలుసుకుందాం.

వ్యాపార నిర్వహణను సులభతరం చేసే దిశగా దేశంలో చేపట్టిన సంస్కరణలు గణనీయమైన మార్పులకు

దారితీశాయి. 2014లో ప్రపంచ బ్యాంకు వ్యాపార నిర్వహణ సౌలభ్య సూచీలో భారత్ 142వ స్థానంలో ఉండేది. నేపాల్, పాకిస్థాన్ కంటే కూడా భారత్ వెనుకబడి ఉంది. అప్పట్లో ఒక కంపెనీని నమోదు చేసుకోవడానికి దాదాపు నెలరోజుల సమయం పట్టేది. మూడు రాష్ట్రాల మీదుగా వెళ్లే ఒక లారీకి మూడు రకాల పన్నులు చెల్లించడంతో పాటు ప్రతి రాష్ట్ర సరిహద్దులోనూ తనిఖీలు, జాప్యాలను ఎదుర్కోవాల్సి వచ్చేది. దీన్ని వ్యాపార వర్గాలు దశాబ్దాలుగా పేరుకుపోయిన నియంత్రణల భారంగా అభివర్ణించేవి. జీఎస్టీ అమలుతో రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న పన్నుల అవరోధాలు తొలగి, సరకు రవాణా మొత్తం ఒకే పన్ను వ్యవస్థ పరిధిలోకి వచ్చింది. డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లు, కొత్త ఎక్స్‌ప్రెస్‌వేలు, మెరుగైన రహదారుల నిర్మాణంతో సరుకుల రవాణా సమయం తగ్గింది. కౌంటర్ల వద్ద కాగితపు ప్రక్రియకు బదులుగా డిజిటల్ అనుమతుల విధానం అందుబాటులోకి వచ్చింది. ఈ సంస్కరణల నేపథ్యంలో 2020 నాటికి వ్యాపార నిర్వహణ సౌలభ్య సూచీలో భారతదేశం 63వ స్థానానికి చేరుకుంది. ఒక పెద్ద ఆర్థిక వ్యవస్థ సాధించిన గణనీయమైన పురోగతుల్లో ఇది ఒకటిగా నమోదైంది. వ్యాపార ప్రక్రియలను సరళీకరించడం ద్వారా పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని భారతదేశం కల్పిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఒక సందర్భంలో తెలియజేస్తూ..

వాయిస్..30 .. సెకన్లు

---------------------------

జపాన్ వేదికగా జరుగుతోన్న ఆసియా క్రీడా పోటీల్లో భారత దేశానికి మూడో స్వర్ణ పతకం లభించింది. ఈరోజు జరిగిన కబడ్డీ ఫైనల్ పోటీల్లో ఇరాన్‌ను 37-33 పాయింట్ల తేడాతో భారత్ జట్టు ఓడించింది. దీంతో భారత్ కి బంగారు పతకం లభించింది. కాగా ఇప్పటి వరకు మహిళల టీ20 క్రికెట్‌లో తొలి పసిడి రాగా రెండోది షూటింగ్ పోటీల్లో వచ్చింది. ఆసియా క్రీడల్లో ఇప్పటి వరకు భారతదేశానికి 27 పతకాలు వచ్చాయి.

---------------------------

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో రాష్ట్రంలోని నాగావళి, వంశధార, గోదావరి, కృష్ణా నదుల్లో వరద ప్రవాహం కొనసాగుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద నిన్న సాయంత్రానికి గోదావరి ఇన్‌ఫ్లో, 5 లక్షల క్యూసెక్కులుగా ఉందని చెప్పారు. ఈరోజు రాత్రికి వరద ప్రవాహం మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరే అవకాశం ఉందని, రేపు రాత్రి నుంచి క్రమంగా తగ్గే అవకాశం ఉందన్నారు. కృష్ణా నదిలో స్వల్పంగా వరద ప్రవాహం కొనసాగుతున్నందున ప్రకాశం బ్యారేజీ వద్ద నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని తెలిపారు. లోతట్టు, నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈరోజు శ్రీకాకుళం, కోనసీమ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

---------------------------

గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డు పరిధిలోని గడ్డిపాడులో రైల్వే పై వంతెనకి కేంద్ర గ్రామీణ పట్టణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి వి.సోమన్నతో కలిసి ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. గుంటూరు పార్లమెంట్ పరిధిలో 8 ఆర్ఓబీల నిర్మాణానికి కేంద్రం 750 కోట్ల రూపాయల నిధులు కేటాయించిందని చెప్పారు. గడ్డిపాడు రైల్వే గేటు ద్వారా రోజుకు 78 రైళ్లు, 20 వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని, గేటు పడిన ప్రతిసారీ ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. ఆర్ఓబీ నిర్మాణంతో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు.

====================